# కాంగ్రెస్‌కు ఓటేస్తే ఢిల్లీకి గులాంగిరే..

- పోరాడి తెలంగాణ సాధించుకున్నాం
- కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మితే ప్రజలకు అధోగతే..
- సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి
- ప్రజలను మోసం చేయడం రేవూరి నైజం
- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి
- 15,16, 17వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం



ఖిలావరంగల్ : వసంతాపురంలో బీఆర్ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డికి మంగళ నీరాజనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



గీసుగొండ : కీర్తినగర్ కాలనీలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, కార్యకర్తలు

గీసుగొండ, నవంబర్ 7 : కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను నమ్మి ఓటు వేస్తే తెలంగాణ ప్రజలంతా ఢిల్లీకి గులాంగిరీ చేయాల్సి వస్తుందని, అదే మన ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటే సంక్షేమ ఫలాలు పొందొచ్చని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గ్రేటర్ 15వ డివిజన్‌లోని పోతురాజుపల్లి, గొర్రెకుంట, 16వ డివిజన్ కీర్తినగర్, గరీబ్‌నగర్, జాన్‌పాకలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణను మళ్లీ అంధకారం చేయడానికి కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వలేదని, ప్రజలు పోరాడి సాధించుకున్నారన్నారు. రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు ఆ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు ఉచిత కరెంటు, రైతు బంధు, రైతు బీమా ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. గ్యారెంటీలకు నమ్మి ఓట్లు వేయవద్దని కోరారు. ఆనాడు రూ.200 ఫింఛన్ ఇవ్వలేని పార్టీ ఇప్పుడు రూ.4 వేల పింఛన్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ వైపు ప్రజలు చూడడం మర్చిపోయారన్నారు. గీసుగొండ మండలంలో లింకు రోడ్లు, అంతర్గత రోడ్లు వేసుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ పరకాల అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి నర్సంపేట, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లోని కార్యకర్తలను మోసం చేసి ఇక్కడకు వచ్చాడని, నర్సంపేటలో చెల్లని రూపాయి పరకాలలో ఎలా చెల్లుతుందని విమర్శించారు. బీజేపీలో చేరి అనేక కాంట్రాక్టులు పొంది, తర్వాత ఆ పార్టీని మోసం చేసి తన అవసరం కోసం కాంగ్రెస్‌లో చేరాడన్నారు. ఆయనతో వెళ్లిన నాయకులు తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు చూస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ ఆకులపల్లి మనోహర్, సుంకరి మనీషాశివకుమార్, డీసీసీబీ డైరెక్టర్ దొంగల రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుంకరి శివకుమార్, బాబురావు, ధర్మేంద్ర, రేణుక, బాలయ్య, విజయ్, లవ్‌రాజు, నర్సయ్య, నవీన్, కొండా రాధ, లక్ష్మణ్‌రావు, గజ్జి రాజు, చిన్నస్వామి, రాజయ్య, కొమ్ముల కిశోర్‌కుమార్, ముంత రాజయ్య, రమేశ్, నాగరాజు, జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, మండలాధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్యారెంటీ లేని పార్టీ కాంగ్రెస్..

ఖిలావరంగల్ : గ్యారెంటీ లేని పార్టీ కాంగ్రెస్, అడ్రస్సే లేని పార్టీ బీజేపీని నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే చల్లా అన్నారు. మంగళవారం రాత్రి గ్రేటర్ 17వ డివిజన్‌లోని స్తంభంపల్లి, వసంతపురం, దూపకుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన బీఆర్ఎస్‌తోనే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దని కోరారు. 50 ఏళ్లుగా తెలంగాణకు రోడ్లు, నీళ్లు, కరెంటు తీసుకురాని మోసగాళ్ల పార్టీలు కాంగ్రెస్, బీజేపీ అని అన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గద్దె బాబు పాల్గొన్నారు.



సభ ఏర్పాట్లపై స్థానిక నాయకులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

# 10న మంత్రి ఎర్రబెల్లి రెండోసెట్ నామినేషన్

- హాజరుకానున్న మంత్రులు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్
- పాలకుర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహణ

పాలకుర్తి రూరల్, నవంబర్ 7: బీఆర్ఎస్ పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ నెల 10వ తేదీన రెండోసెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ దాఖలు సందర్భంగా పాలకుర్తిలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్ హాజరుకానున్నారు. స్థానిక బస్టాండ్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో సభా స్థలిని మంత్రి ఎర్రబెల్లి మంగళవారం పరిశీలించారు. సభ ఏర్పాట్లపై బీఆర్ఎస్ నాయకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా నిర్వహించే సభకు రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఆరోగ్యశ్రీ ట్రస్టు చైర్మన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్ సుధాకర్‌రావు హాజరవుతారని చెప్పారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించే సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారన్నారు. ఈ కార్య ఎంపీపీ నల్లానాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎర్రబెల్లి రాఘవరావు, ముస్కు రాంబాబు ఉన్నారు.



మున్నూరు కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

# దాస్యంకు మున్నూరు కాపుల మద్దతు

**ఆత్మీయ సమావేశంలో తీర్మానం**

వరంగల్, నవంబర్ 7 : వరంగల్ పశ్చిమ నియోజవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్‌కు మున్నూరుకాపులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మంగళవారం కాపువాడలో భద్రకాళీ మున్నూరుకాపు సంఘం కాలనీలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వినయ్‌భాస్కర్‌ను ముఖ్యఅతిథిగా పిలిచి మద్దతు తెలిపారు. దాస్యం గెలుపు కోసం మున్నూరుకాపులు కృషి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరుకాపులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. తనకు మద్దతు ఇస్తున్న మున్నూరుకాపుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని చెప్పారు. జవవనరుల శాఖ చైర్మన్ వీ ప్రకాశ్ మాట్లాడుతూ.. మున్నూరుకాపు బిడ్డ దాస్యం విజయం కోసం మూన్నూరుకాపు కులస్తులంతా సంఘటితంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, పశ్చిమ కో ఆర్డినేటర్ కనుకుంట రవికుమార్, శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, వేల్పుల మోహన్‌రావు, మాడిశెట్టి శివశంకర్, నాయకులు రాంప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పూజారి సత్యనారాయణ, మహిళా నాయకురాళ్లు మాడిశెట్టి అరుంధతి, శోభారాణి పాల్గొన్నారు.

# కలిసికట్టుగా శ్రమిద్దాం.. బీఆర్ఎస్‌నే గెలిపిద్దాం..

- చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కే మా మద్దతు
- రజక సంఘం, సెలూన్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో తీర్మానం

న్యూశాయంపేట, నవంబర్ 7 : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను అందరూ కలిసికట్టుగా శ్రమించి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పేర్కొన్నారు. మంగళవారం గ్రేటర్ 31వ డివిజన్ పద్మాక్షి రోడ్డులోని రజక భవనంలో రజక సంఘం, సెలూన్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే రజకుల సంక్షేమానికి మరింత కృషి చేస్తారని చెప్పారు. బీఆర్ఎస్ సర్కారుపై అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని కోరారు. రజక సంఘం, సెలూన్ అసోసియేషన్ నాయకులు కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నిరంతరం పేదల కోసం పని చేసే వ్యక్తి దాస్యం వినయ్‌భాస్కర్‌ను గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు కోరారు. రజకులు, నాయీ బ్రాహ్మణులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్లు చీకటి శారద-ఆనంద్, నెక్కొండ కవిత-కిషన్, మాజీ కార్పొరేటర్లు దాస్యం విజయ్‌భాస్కర్, మాడిశెట్టి శివశంకర్, జోరిక రమేశ్, నాయకులు డాక్టర్ మధుచందర్, గూడెల్లి రాంచంద్రం, అంకయ్య, సూర్యప్రకాశ్, రామస్వామి, సాంబయ్య పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



జేఎన్ఎస్‌లో క్రీడాకారులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న హనుమకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

# ఓటు హక్కును వినియోగించుకోవాలి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 7 : ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా పిలుపునిచ్చారు. మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో జేఎన్ఎస్‌లో ఓటర్ క్యాంపెన్‌లో భాగంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాల నిండిన వారు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం వాలీబాల్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ ఎం హరిప్రసాద్, హనుమకొండ డీవైఎస్‌వో గగులోత్ అశోక్‌కుమార్, కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ పోచంపల్లి వాహనం తనిఖీ

నల్లబెల్లి, నవంబర్ 7 : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీస్ శాఖ మండలంలోని బొల్లోనిపల్లె గ్రామంలో చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. మల్లంపల్లి నుంచి 365 జాతీయ రహదారిపై నర్సంపేటకు వెళ్తున్న ఎమ్మెల్సీ వాహనాన్ని నల్లబెల్లి ఎస్సై సైనాల నగేశ్ ఆధ్వర్యంలో వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎన్నికల అధికారి కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై నగేశ్